నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | సోమవారం 30 సెప్టెంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

సి'కిల్'సెల్‌పై స్పెషల్ డ్రైవ్

వాంకిడిలో వ్యాధిపై ఈజీఎస్, ఐకేపీ, కార్యదర్శులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

- ఏజెన్సీలో నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్యశాఖ
- పల్లెల్లో కొనసాగుతున్న అవగాహన సదస్సులు
- 40 వేల మందికి పరీక్షలు చేసే అవకాశం
- గతంలో 375 మంది వ్యాధిగ్రస్తుల గుర్తింపు

కుమ్రం భీం ఆసిఫాబాద్, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ) : ఏజెన్సీ ప్రాంతాల్లో చాపకింద నీరులా వ్యాపిస్తున్న 'సికిల్ సెల్'కు అడ్డుకట్టవేసేందుకు వైద్య, ఆరోగ్య శాఖ చర్యలు చేపడుతున్నది. ఈ మేరకు గిరిజన ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నది. వంశపారంపర్యంగా సంక్రమించే ఈ రక్త సంబంధిత వ్యాధిని సకాలంలో గుర్తించి వైద్య సేవలు అందిస్తే ప్రాణాలు కాపాడవచ్చని అధికారులు చెబుతున్నారు.

కొనసాగుతున్న స్పెషల్ డ్రైవ్..

ప్రధానంగా గిరిజన తెగల్లో అంత్యంత వెనుకబడిన కొలాం, తోటి, మన్నేవార్ తెగలను తలసేమియా (ఎముక మూలుగలో రక్తకణాల ఉత్పత్తి నిలిచిపోయి రక్తహీనతకు దారితీయటం), సికిల్ సెల్ (వంశానుగత రక్తరుగ్మత) వ్యాధులు వెంటాడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లోగల పాఠశాలల్లో 2015, 2022లలో సికిల్ సెల్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ప్రత్యేకంగా హాస్టళ్లు, వసతి గృహాల్లో రక్త నమూనాలను సేకరించి పరీక్షించారు. సుమారు 375 మందికి తలసేమియా, సికిల్‌సెల్ ఉన్నట్లు నిర్ధారించారు. ప్రస్తుతం ఈ వ్యాధిపై జిల్లాలోని ఆదివాసీ గ్రామాల్లో ప్రత్యేకంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. అలాగే అవగాహన సదస్సులు కూడా చేపడుతున్నారు. మొత్తంగా 40 వేల మందికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసే లక్ష్యంతో అధికారులు ముందుకెళ్తున్నారు.

బతుకమ్మ వీడియో సాంగ్ చిత్రీకరణ

బతుకమ్మ వీడియో ఆల్బమ్ చిత్రీకరణలో యూనిట్ సభ్యులు

కాసిపేట, సెప్టెంబర్ 29 : ముత్యంపల్లి ఎస్సీ కాలనీకి చెందిన గొడిసెల కృష్ణ నేతృత్వంలో ఆదివారం కాసిపేటలో బతుకమ్మ సాంగ్‌ను చిత్రీకరించారు. గొడిసెల కృష్ణ నాలుగేళ్లుగా బతుకమ్మ పండుగకి పాటలు రాస్తూ గుర్తింపు తెచ్చుకున్నాడు. ఇందులో భాగంగా ఈ యేడాది 'ఓయిలాలో నా రామ సెందురాలో' సాంగ్‌ను జిల్లాలోని పలు లొకేషన్స్‌లో చిత్రీకరిస్తురు. ఈ వీడియో సాంగ్‌ను రుచిత క్రియేషన్స్ ద్వారా నిర్మిస్తున్నారు. ఈ పాటకు దుర్గం సునీత, హనుమంతు యాదవ్ గానం అందించారు. హీరోయిన్‌గా నీతూ క్వీన్, ముల్కల్ల మురళి, దుర్గం సునీత, గొడిసెల కృష్ణ, వెళ్తురు పోషన్న, గొడిసెల అరుణ, తనుశ్రీ నటిస్తున్నారు. డైరెక్టర్‌గా మామిళ్ల లక్ష్మణ్, కెమెరామెన్‌గా హరీశ్ పటేల్ వ్యవహరిస్తున్నారు.

శనిగకుంటను పేల్చింది.. సింగరేణి బాంబులే..?

ఆర్‌కే ఓసీపీ నుంచి తెచ్చిన జిలెటిన్ స్టిక్స్‌తోనే మత్తడి బ్లాస్టింగ్

- పేలుడు పదార్థాలు సరఫరా చేసింది కీలక సూత్రధారి చుట్టమే
- పరారీలో ఉన్న బత్తుల సమ్మయ్య, రాంలాల్ గిల్డాల అరెస్టు!
- మహారాష్ట్ర గుల్బర్గాలో పట్టుకున్నట్లు సమాచారం
- త్వరలో కీలక సూత్రధారులు..

మంచిర్యాల, సెప్టెంబర్ 29(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : చెన్నూర్‌లోని శనిగకుంట మత్తడిని సింగరేణి బాంబులతోనే పేల్చివేసినట్లు జోరుగా చర్చ సాగుతున్నది. మందమర్రి ఏరియాలో ఆర్‌కే ఓసీపీలో ఎక్స్‌ప్లోజివ్ మ్యాగ్జిన్‌లో నుంచి ఈ పేలుడు పదార్థాలు సరఫరా అయినట్లు సమాచారముండగా, ఇప్పుడు ఈ అంశం హాట్‌టాపిక్‌గా మారింది. శనిగకుంట కేసులో కీలక సూత్రధారులుగా ఉన్న హస్తం పార్టీ లీడర్ల బంధువు ఒకరు ఆర్‌కే ఓసీపీలో పనిచేస్తున్నారు. ఎంకే-4 బరాక్‌లో మేనేజర్‌గా ఉన్న ఆ వ్యక్తి నుంచే పేలుడు పదార్థాలు బయటకు వచ్చాయని విశ్వసనీయంగా తెలిసింది. అందుకే శనివారం రాత్రి వరకు ఈ కేసులో అదుపులోకి తీసుకున్న కాంగ్రెస్ లీడర్లు బాపురెడ్డి, పెద్దింటి శ్రీనివాస్ సహా పోలీసులు పరారీలో ఉన్నట్లు చెబుతున్న మరో లీడర్ బత్తుల సమ్మయ్యను ఈ కేసు నుంచి తప్పించాలని పట్టుబట్టిన సదరు లీడర్ సైలెంట్ అవ్వడానికి కూడా ఇదే కారణమని తెలిసింది. నిన్న కూడా ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా మీటింగ్ పెట్టి, ఈ విషయంలో దిగిరాకుంటే మూకుమ్మడి రాజీనామాలు చేస్తామంటూ హడలెత్తించిన వారంతా ప్రస్తుతం కిమ్మనకుండా ఉంటున్నారు. ఎమ్మెల్యే ఆదేశాలంటూ ఆదివారం అభివృద్ధి పనులను పరిశీలించడంలో బిజీ అయ్యారు. ఒక్క రాత్రిలో ఇంత మార్పు ఎందుకు వచ్చిదంటే.. ఈ బాంబుల వ్యవహారం బయటికి రావడంతోననే సమాచారముంది. పోలీసులు మాత్రం దీన్ని అధికారికంగా నిర్ధారించలేదు. అసలు సింగరేణి నుంచి పేలుడు పదార్థాలు బయటికి రావు. ఎక్స్‌ప్లోజివ్ మ్యాగ్జిన్ అనేది పోలీసుల భద్రతలో ఉంటుంది. సింగరేణి వారు ఏం తెచ్చినా అది రికార్డులో నమోదు చేయాల్సి ఉంటుంది. ఇంత పకడ్బందీ వ్యవస్థ ఉన్నప్పటికీ ఓసీపీ నుంచి ఆ పేలుడు పదార్థాలు బయటికి వచ్చాయంటే.. ఆషామాషీ వ్యవహారం కాదు. అందుకే పోలీసులు ఈ విషయాన్ని నిర్ధారించడం లేదని తెలుస్తున్నది. ఆ కోణంలో విచారణ కొనసాగిస్తున్నామని మాత్రమే చెబుతున్నారు.

బాంబులతో పేల్చివేసిన శనిగకుంట చెరువు మత్తడి (ఫైల్)

ఇద్దరి అరెస్టు.. వివరాలు గోప్యం..

శనిగకుంట చెరువు బఫర్‌జోన్‌లో మట్టిపోసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు, నాయకులను అరెస్టు చేయడం దాదాపు ఖాయమైంది. ఈ మేరకు శుక్రవారమే ప్రయత్నం చేయగా, ఈ కేసుతో సంబంధమున్న 10 మందిలో కొందరు పారిపోయారు. దీంతో పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్న వారిని విచారించి, అనుమతి లేకుండా బయటికి వెళ్లకూడదనే పూచీకత్తుపై వదిలివేశారు. కాగా, ఈ కేసులో కీలకంగా ఉన్న మరో ఇద్దరు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బత్తుల సమ్మయ్య, చెన్నూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త రాంలాల్ గిల్డాను శనివారం అర్ధరాత్రి మహారాష్ట్రలోని గుల్బర్గాలో పట్టుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ రోజు ఆదివారం కావడంతో వారిని అక్కడే ఉంచారని, సోమవారం ఇక్కడికి తీసుకువస్తారని తెలిసింది. వారు అరెస్టైన విషయాన్ని పోలీసులు గోప్యంగా ఉంచుతున్నారు. వాళ్లు ఇక్కడికి వచ్చిన వెంటనే ఈ కేసులో జోక్యం ఉన్న అధికార పార్టీ లీడర్లతో పాటు ఇతర పార్టీల నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులను అరెస్టు చేస్తారని తెలిసింది.

పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీసీపీ భాస్కర్

ఒకటికంటే ఎక్కువ కేసులుంటే రౌడీషీట్

- మంచిర్యాల డీసీపీ భాస్కర్
- ఆకస్మికంగా మంచిర్యాల పోలీస్‌స్టేషన్ తనిఖీ

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 29 : ఒకటి కంటే ఎక్కువ కేసులుంటే వారిపై రౌడీషీట్ తెరిచి ప్రత్యేక నిఘా పెడుతామని మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. ఆదివారం మంచిర్యాల పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌ను ఏసీపీ రత్నపురం ప్రకాశ్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని, మహిళలు, పిల్లలు, సీనియర్ సిటిజన్లతో మర్యాదగా మెలగాలని సిబ్బందికి సూచించారు. వ్యభిచారం చేసేవారిపై చట్టపరమైన చర్యలుంటాయని, సంబంధిత స్థలాలను జప్తు చేసి కోర్టుకు సమర్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ బన్సీలాల్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలిక కుటుంబానికి రూ.25 లక్షలు అందించాలి

- కార్పొరేట్ పాఠశాలలో చేర్పించాలి
- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

బాలిక, బాలిక కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, సెప్టెంబర్ 29 : లైంగిక దాడికి గురైన బాలిక కుటుంబానికి రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, కార్పొరేట్ పాఠశాలలో చేర్చి మెరుగైన విద్య నందించాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి డిమాండ్ చేశారు. ఆదివారం బూరుగూడలో బాలిక కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఇలాంటి దుర్ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని, పల్లెల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు నిర్వహించడం వల్ల యువత మద్యానికి బానిసై ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నారని, వెంటనే బెల్ట్ షాపులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో బూరుగూడ మాజీ సర్పంచ్ చౌదరి గోపాల్, బీఆర్ఎస్ నాయకుడు ఇర్రండి వినోద్ ఉన్నారు.

వికటించిన పీఎంపీ వైద్యం

- అపస్మారక స్థితిలోకి వెళ్లిన శ్రీలత
- బ్రెయిన్‌డెడ్‌తో కోమాలోకి
- హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి
- పీఎంపీని అరెస్టు చేసిన పోలీసులు

శ్రీలత (ఫైల్)

సీసీసీ నస్పూర్, సెప్టెంబర్ 29 : పీఎంపీ వైద్యం వికటించి ఓ వివాహిత మృతి చెందిన ఘటన సీసీసీ నస్పూర్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. నస్పూర్ నాగార్జునకాలనీకి చెందిన చింతం శ్రీలతకు ఈ నెల 27న రాత్రి జ్వరం వచ్చింది. దీంతో ఆమె భర్త చింతం రాజు 28న సమీపంలోని పీఎంపీ వైద్యుడు బిరుదుల ప్రశాంత్‌ను ఇంటికి పిలిపించాడు. పీఎంపీ ఇంట్లోనే శ్రీలతకు సెలైన్ బాటిల్ పెట్టి వెళ్లిపోయాడు. కొద్దిసేపటికే ఆమె చలికి వణుకుతూ తీవ్ర అస్వస్థతతకు గురైంది. దీంతో వెంటనే పీఎంపీ వైద్యుడికి సమాచారం అందించగా, ఆయన వచ్చి సెలైన్ తొలగించాడు. ఏమీ కాదంటూ ఇంజెక్షన్ వేసి వెళ్లిపోయాడు. వైద్యుడు వచ్చి వెళ్లిన తర్వాత భర్త చింతం రాజు కూతురును తీసుకురావడానికి స్కూల్‌కు వెళ్లాడు. అతను వచ్చి చూసే సరికి భార్య శ్రీలత వాంతులు, విరేచనాలతో అపస్మారకస్థితిలోకి వెళ్లింది. ఆందోళనకు గురైన రాజు వెంటనే ఆమెను మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించాడు. పరిస్థితి విషమంగా ఉందని గమనించిన వైద్యులు కరీంనగర్‌కు రెఫర్ చేశారు. కరీంనగర్‌కు తరలించగా, అక్కడి వైద్యులు హైదరాబాద్‌కు తీసుకెళ్లాని సూచించారు. హైదరాబాద్‌లోని ఓ దవాఖానకు తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి బ్రెయిన్‌డెడ్ అయిందని తెలిపారు. అక్కడే చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఆమె ప్రాణాలు విడిచింది. సీసీసీ నస్పూర్ ఎస్ఐ సుగుణాకర్ శ్రీలత ఇంటికి వెళ్లి వివరాలు సేకరించారు. అనంతరం గోదావరికాలనీలోని పీఎంపీ ప్రశాంత్‌ను అదుపులోకి తీసుకున్నారు. పీఎంపీ వేసిన ఇంజెక్షన్, సెలైన్లు స్వాధీనం చేసుకున్నారు. ఆ పక్కనే ఉన్న మహాలక్ష్మి మెడికల్ షాపు నిర్వాహకుడిని కూడా అదుపులోకి తీసుకున్నారు.

గతంలో ఆర్ఎంపీ, పీఎంపీలపై కేసులు

ఆర్ఎంపీ, పీఎంపీలు అత్యవసర పరిస్థితుల్లో ప్రాథమిక చికిత్సలు అందించి, రెఫర్ చేయకుండా సొంత వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఇటీవల వైద్యం వికటించి పలువురు ప్రాణాలు పోగొట్టుకున్న విషయం విదితమే. ఈ ఏడాది మే 30న సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఐదుగురు ఆర్ఎంపీ, పీఎంపీలపై కేసులు నమోదయ్యాయి. కేంద్ర, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు సంయుక్తంగా దాడులు చేశారు. నస్పూర్‌లోని విద్యానగర్‌లో క్లినిక్ నడిపిస్తున్న గుండా సుధాకర్, సీసీసీలో చుంచు శంకర్‌వర్మ, బిట్ల వెంకటస్వామి, నిగ్గల కుమారస్వామి, గాంధీనగర్‌కు చెందిన అటికం శ్రీనివాస్‌లపై నేషనల్ మెడికల్ కౌన్సిల్ యాక్ట్ కింద కేసులు నమోదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా క్లినిక్‌లు నడిస్తున్నారని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు మామిడాల రాము వీరిపై కేసులు నమోదు చేసి సీసీసీ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. కేసుల భయంతో కొద్ది రోజులు క్లినిక్‌లలో ఆర్ఎంపీ, పీఎంపీలు వైద్య సేవలు నిలిపివేశారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు విజృంభిస్తుండడంతో భయం భయంగా వైద్య సేవలు కొనసాగిస్తున్నారు. క్లినిక్‌లలో కాకుండా ఇంటి వద్దకు వెళ్లి వైద్యం అందిస్తున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

- బెటాలియన్ కమాండెంట్ వెంకట్రాములు

క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న కమాండెంట్, క్రీడాకారులు

హాజీపూర్, సెప్టెంబర్ 29 : క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని గుడిపేట 13వ ప్రత్యేక తెలంగాణ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ వెంకట్రాములు అన్నారు. ఆదివారం గుడిపేటలోని బెటాలియన్‌లో శిక్షణ పొందుతున్న వారికి నిర్వహిస్తున్న పోటీలకు ఆయన హాజరై క్రీడా జ్యోతిని వెలిగించారు. అనంతరం 100, 200, 400 మీటర్ల పరుగు పందేల పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ నాగేశ్వర్‌రావు, బెటాలియన్ అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, శిక్షణ కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సారంగపల్లిలో పోలీసుల పల్లె నిద్ర

గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ రాజశేఖర్

మందమర్రి రూరల్,సెప్టెంబర్ 29: పోలీసులు-ప్రజలకు మధ్య స్నేహ భావం కలిగించేలా రామగుండం కమిషనర్ శ్రీనివాస్ ఆదేశాల మేరకు పట్టణ ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది శనివారం రాత్రి మండలంలోని సారంగపల్లిలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో కలిసి సమస్యలపై చర్చించి పలు సూచనలు చేశారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓటీపీలు, డెబిట్ కార్డుల నంబర్లు చెప్పవద్దన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, క్రమ శిక్షణతో చదువుకోవాలని సూచించారు. గ్రామాల్లోకి అనుమానాస్పద వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకునేందుకే పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.

శ్రీరాంపూర్ ఆర్కే 5గనిపై జరిగిన దొంగతనం గురించి తెలుసుకుంటున్న ఏఐటీయూసీ నాయకులు

దొంగలు పగలగొట్టిన లాకర్స్

ఆర్కే-5గనిపై దొంగతనం

- రూ. 10 వేలతో పాటు దుస్తులు, బ్యాగులు, సెల్‌ఫోన్లు అపహరణ
- పోలీసులకు ఫిర్యాదు

శ్రీరాంపూర్, సెప్టెంబర్ 29 : శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-5 గనిపై కార్మికుల రెస్ట్ హాల్‌లో శనివారం రాత్రి దొంగతనం జరిగింది. కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కార్మికుల వ్యక్తిగత టూల్ బాక్స్‌లు(పెట్టలు) పగుల గొట్టి వాటిలోని రూ. 10 వేలతో పాటు దుస్తులు, బ్యాగులు, సెల్‌ఫోన్లు (రూ. 3 లక్షల విలువ) ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, పిట్ కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, నర్సింహారావు, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్ రెస్ట్‌హాల్‌ను పరిశీలించారు. కార్మికులతో మాట్లాడి దొంగతనంలో పోగొట్టుకున్న వస్తువుల గురించి అడిగి తెలుసుకున్నారు. టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, డిప్యూటీ ప్రధానకార్యదర్శి బండి రమేశ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పానగంటి సత్తయ్య, చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పొగాకు రమేశ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి అన్వేష్‌రెడ్డి, గొర్ల సంతోష్, గని ఇన్‌చార్జి దుర్గం రవి, పాపిరెడ్డి, ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు జే శంకర్‌రావు దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. నాయకులు మాట్లాడుతూ యాజమాన్యం కబ్‌బోర్డు(లాకర్స్)రూం ఏర్పాటు చేయకపోవడం వల్లే తరచూ దొంగతనాలు జరుగుతున్నాయన్నారు. వెంటనే పర్మినెంట్ టూల్‌రూం, లాకర్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దొంగతనాలు జరుగుతున్నాయంటే ఎస్అండ్‌పీసీల వైఫల్యమేనని, ఇందుకు యాజమాన్యమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్మికులు మేనేజర్‌కు ఫిర్యాదు చేశారు. సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్ శ్రీరాంపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇల్లు కూల్చుతమని నోటీసులిచ్చిన్రు

నోటీసు చూపిస్తున్న అమ్రత్ సింగ్, కుటుంబ సభ్యులు

- గదే జరిగితే గీ ఇంట్లోనే సచ్చిపోతం
- భీమారానికి చెందిన అమ్రత్ సింగ్ కుటుంబం ఆవేదన

భీమారం, సెప్టెంబర్ 29 : 30 ఏండ్ల కిందట ఇక్కడికి వలస వచ్చినం. రోడ్డు పక్కన కవర్లు కప్పుకొని బతికినం. డ్రమ్ములు, ఇండ్ల సామగ్రి అమ్ముకొని పైసా పైసా కూడబెట్టి.. అప్పులు తెచ్చి రూ. 30 లక్షలతో ఇల్లు కట్టినం. దీనికి సార్లు కూడా పర్మిషన్ ఇచ్చిన్రు. ఇప్పుడచ్చి చెరువు ఎఫ్‌టీఎల్‌లో భూమి ఉంది. ఇల్లు కూల్చుతమని నోటీసులిచ్చిన్రు. ఇప్పుడు నా తల్లిదండ్రులు, భార్యా పిల్లలను పట్టుకొని ఎక్కడికి పోవాలి. ఇదెక్కడి న్యాయం. నా ఇల్లు కూల్చితే గండ్లనే పడి సచ్చిపోతం' అంటూ భీమారానికి చెందిన అమ్రత్‌సింగ్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఆవేదన వ్యక్తం చేశాడు. ఆదివారం తన ఇంటి ముందు అధికారులిచ్చిన నోటీసును చూపిస్తూ కన్నీరు పెట్టుకున్నాడు. సర్కారు స్పందించి తనకు న్యాయం చేయాలని వేడుకున్నాడు.